
యూనిట్ II

# 6. విద్యార్థిగా నేను..

*మూలం : మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ*
*తెలుగుసేత : వేమూరి రాధాకృష్ణ*

**ఆలోచించండి-మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. చిత్రంలో ఎవరున్నారు?
2. ఆయనను గౌరవంగా మనం ఏ పేర్లతో పిలుస్తాం?
3. అతడిని మహాత్ముడని ఎందుకు కీర్తిస్తాం?
4. "విద్యార్థి"గా ఉన్నప్పుడు వారు ఎలా ఉండి ఉంటారు?

**ఉద్దేశం:** మహాత్ముల జీవితాలు ఎల్లకాలం అందరికీ ఆదర్శం. మహాత్ముల అనుభవాలు సత్ప్రవర్తనకు, లక్ష్యసాధనకు ప్రేరణ కలిగిస్తాయి. కాబట్టి గాంధీ మహాత్ముడు విద్యార్థిగా పొందిన అనుభవాల ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ కలిగించడమే ఈ పాఠం ఉద్దేశం.


ఈ పాఠం వేమూరి రాధాకృష్ణగారు అనువాదం చేసిన గాంధీమహాత్ముని "సత్యశోధన" ఆత్మకథ లోనిది.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



మేం ముగ్గురు సోదరులం ఒకే హైస్కూల్లో చేరి చదువుతున్నాం. మా పెద్దన్నయ్య పెద్ద తరగతిలో ఉన్నాడు. నాతోపాటు రెండో అన్నయ్య నాపై తరగతిలో ఉన్నాడు. ఆయన బడి మానివేశాడు. మా అన్నవలె ఎంతమంది పిన్న వయస్సులో యీ విధంగా చదువు మానివేశారో ఆ భగవంతునికే ఎరుక.



నా చదువు మాత్రం ఆగిపోలేదు. హైస్కూల్లో నాకు మొద్దబ్బాయి అని పేరురాలేదు. ఉపాధ్యాయులకు నాయెడ వాత్సల్యం మెండు. పిల్లవాడి నడతను గురించి, అతని చదువును గురించి ప్రతి సంవత్సరం స్కూలు నుండి ఒక సర్టిఫికెట్ తల్లిదండ్రులకు పంపుతూ ఉంటారు. వాళ్ళు ఎప్పుడూ నా నడతను గురించి కాని, నా చదువును గురించి కాని వ్యతిరేకంగా రాయలేదు. రెండో తరగతి తరవాత నేను బహుమతులు కూడా కొన్ని సంపాదించాను. అయిదవ, ఆరవ తరగతుల్లో నెలకు నాలుగు రూపాయలు, ఆ తరువాత పదిరూపాయల చొప్పున విద్యార్థి వేతనం కూడా పొందాను.

నాకు తెలిసినంతవరకు తెలివితేటల్ని గురించిన గర్వం నాకు ఉండేదికాదు. బహుమతులు లేక స్కాలర్‌షిప్పులు లభించినప్పుడు ఆశ్చర్యం కలిగేది. కాని నడతను గురించి మాత్రం జాగ్రత్తగా ఉండేవాణ్ణి. ఆచరణలో దోషం కనబడితే ఏడుపు వస్తూ ఉండేది. ఉపాధ్యాయులు నన్ను మందలించడం కాని, అట్టి పరిస్థితి ఏర్పడడం కాని నేను సహించలేకపోయేవాణ్ణి. నాకు బాగా జ్ఞాపకం. దొరాబ్జీ ఎదల్జీ గీమీ హెడ్‌మాష్టరు. ఆయన విద్యార్థులకు ఇష్టుడు. తాను నియమబద్ధంగా పనిచేస్తూ ఇతరులచేత పనిచేయించేవాడు. చదువు బాగా చెప్పేవాడు. పెద్ద తరగతి విద్యార్థులకు వ్యాయామం, క్రికెట్టు అనివార్యం చేశాడు. నాకు ఇవి ఇష్టంలేదు. నేను వాటిలో పాల్గొనేవాణ్ణి కాదు. నా అయిష్టం సరికాదని ఇప్పుడు నాకు అనిపిస్తుంది. ఆ రోజుల్లో చదువుకు, వ్యాయామానికి ఏమాత్రం సంబంధం లేదని నేను అనుకునేవాణ్ణి. విద్యార్జనతోబాటు అంటే మానసిక శిక్షణతోబాటు వ్యాయామం శారీరకశిక్షణ కూడా విద్యార్థికి అవసరమని తరవాత బోధపడింది. తెరపగాలిలో వాహ్యాళి ఎంతో ప్రయోజనకరమైదని చదివాను. ఆ సలహా నాకు నచ్చింది. దాంతో పెద్ద తరగతుల్లో చదువుకునేటప్పటి



©SCERT not to be republished

నుంచి నాకు కాలినడకన వాహ్యాళికి వెళ్ళడం అలవాటైపోయింది. చివరివరకు ఈ అలవాటు నన్ను వదలలేదు. కాలినడకన తిరగడం కూడా మంచి వ్యాయామమే. అందువల్ల నా శరీరంలో కొంచెం బిగువు వచ్చింది. నా తండ్రికి సేవ చేయాలనే తలపు కూడా వ్యాయామంలో పాల్గొనకపోవడానికి మరో కారణం.

ఒక శనివారం నాడు స్కూలు ఉదయంపూట నడిపారు. సాయంకాలం మేఘాలు క్రమ్మాయి. అందువల్ల టైం ఎంత అయిందో తెలియలేదు. మేఘాలవల్ల మోసపోయాను. క్లాసుకు వెళ్ళాను. ఎవ్వరూ లేరు. రెండో రోజున గీమీ గారు హాజరు పట్టీని చూశారు. నేను పాల్గొనలేదని తేలింది. కారణం అడిగారు. నేను నిజం చెప్పాను. నేను చెప్పింది నిజం కాదని ఆయన భావించారు. నేను అబద్ధం చెప్పలేదని రుజువుచేయడం ఎలా? ఉపాయం ఏమీ కనబడలేదు. ఊరుకున్నాను. బాగా ఏడ్చాను. నిజం మాట్లాడేవారు, నిజాయితీగా వ్యవహరించేవారు ఏమరచి ఉండకూడదని గ్రహించాను. చదువుకునే రోజుల్లో అజాగ్రత్తగా ఉండడం అదే ప్రథమం. అదే అంతిమం కూడా.

మరో పొరపాటువల్ల కలిగిన ఫలితం నేను ఈనాటికీ అనుభవిస్తున్నాను. చదువుకునేటప్పుడు అందంగా రాయడం నేర్చుకోవలసిన అవసరం లేదనే తప్పు అభిప్రాయం నా బుర్రలో ఎలా దూరిందో తెలియదు; దూరిపోయింది. విదేశానికి బయలుదేరేంత వరకు ఆ అభిప్రాయం మారలేదు. కాని దక్షిణాఫ్రికాకు వెళ్ళిన తరువాత, అక్కడి వకీళ్ళు అక్కడి ప్రజలు ముత్యాల్లాంటి అందమైన అక్షరాలు రాస్తూ ఉంటే చూసి సిగ్గుపడ్డాను. వంకరటింకర అక్షరాలు అసంపూర్ణ విద్యకు చిహ్నంగా భావించాలనే భావం అప్పుడు నాకు కలిగింది. తరువాత నా అక్షరాల్ని అందంగా రాద్దామని ఎంతో ప్రయత్నించాను. కాని వ్యవహారం చేయిదాటిపోయింది. దస్తూరీ మార్చుకోలేకపోయాను. నన్ను చూసి ప్రతి బాలుడూ, బాలికా జాగ్రత్తపడాలని కోరుతున్నాను. మంచి దస్తూరీ విద్యలో భాగమని అందరూ గుర్తించాలి. అక్షరాలు దిద్దించుటకు ముందు బాలురకు చిత్రలేఖనం నేర్పడం అవసరమని నాకు అనిపించింది. పూవులు, పిట్టలు మొదలుగా గల వాటిని పరిశీలించి చిత్రించినట్లే అక్షరాల్ని కూడా పరిశీలించి రాయడం అవసరం. వస్తువుల్ని చూసి గీయడం నేర్చుకున్న తరవాతే రాత నేర్పడం మంచిది. అప్పుడు అక్షరాలు అందంగా ఉంటాయి.

ఆనాటి మా బడిని గురించిన రెండు విషయాలు చెప్పవలసినవి ఉన్నాయి. నా(కు) ఒక సంవత్సర కాలం వ్యర్థమైపోయింది. దాన్ని సరిచేసేందుకు ఉపాధ్యాయుడు నన్ను పై క్లాసులో చేర్పించాడు. కష్టపడి చదివేవాళ్ళకు అట్టి అవకాశం లభిస్తూ ఉండేది. అందువల్ల నేను మూడో తరగతిలో ఆరునెలలు మాత్రమే ఉండి ఎండాకాలపు సెలవులకు పూర్వం జరిగే పరీక్షలు పూర్తి అయిన తరవాత నాలుగో తరగతిలో చేర్చబడ్డాను. నాలుగో తరగతి నుండి పాఠ్య విషయాలు ఎక్కువభాగం ఇంగ్లీషులో బోధించేవారు. నాకు నడి సముద్రంలో ఉన్నట్లు అనిపించేది. రేఖాగణితం నాకు కొత్త. ఇంగ్లీషులో రేఖాగణితం బోధించడంవల్ల నాపాలిట అది గుదిబండ అయింది. ఉపాధ్యాయుడు పాఠం బాగా చెప్పేవాడు. కాని ఏమీ బోధపడేది కాదు. పాఠాలు కష్టంగా ఉండడం వల్ల నా మనస్సు కలత చెంది తిరిగి మూడో తరగతిలోనే చేరదామని భావించాను. రెండేండ్ల చదువు ఒక సంవత్సరంలో పూర్తి చేయడం కష్టమనిపించింది. కాని నాకంటే కూడా నా ఉపాధ్యాయునికి ఇలా తిరిగి నేను మూడో తరగతిలో చేరడం అవమానమనిపించింది. నా చదువుమీద గల విశ్వాసంతో ఆయన నన్ను నాలుగో తరగతిలో చేర్పించాడు. ఇంత శ్రమపడిన తరవాత తిరిగి మూడో తరగతిలో నేను చేరడం సబబా? అందువల్ల నేను నాలుగో తరగతిలోనే ఉండిపోయాను. బాగా కష్టపడి చదవడం ప్రారంభించాను. యూక్లిడ్‌లో 13వ ప్రిపోజిషన్ వరకురాగా, అక్కడినుండి రేఖాగణితం సులభంగా బోధపడిపోయింది. తెలివితేటల్ని ఉపయోగించి సరళప్రయోగాలు చేస్తూ కృషిచేస్తే ఏ విషయమైనా తప్పక బోధపడుతుంది. అప్పటి నుండి నాకు రేఖాగణితం యెడ అభిరుచి పెరిగింది.



సంస్కృతం బాగా కష్టమనిపించింది. రేఖాగణితంలో బట్టీపట్టవలసిన అవసరం ఉండేదికాదు. కాని సంస్కృతం అంతా బట్టీపట్టడమే. అది చూసి సంస్కృత ఉపాధ్యాయుడు చాలా బాధపడ్డాడు. నన్ను పిలిచి "అబ్బాయి! నీవు ఎవరికొడుకువో ఆలోచించుకో. నీ ధార్మిక భాష సంస్కృతం. దాన్ని నీవు నేర్చుకోవా? సంస్కృతం రాకపోతే నా దగ్గరికి రావచ్చుకదా? శక్తి కొద్దీ పిల్లలకు సంస్కృతం నేర్పడం నా లక్ష్యం. ముందు ముందు సంస్కృతం తేలిక అవుతుంది. అధైర్యపడవద్దు" అని మంచిగా చెప్పాడు.

ఆయన పేరు కృష్ణశంకర పాండ్యా. ఇప్పుడు వారిని, వారు చెప్పిన పాఠాల్ని గుర్తుచేసుకుంటే నా హృదయం వారి ఉపకారాన్ని మర్చిపోలేక కృతజ్ఞతతో నిండిపోతుంది. ఆనాడు వారిదగ్గర ఆ కొద్దిపాటి సంస్కృతం నేర్చుకుని ఉండకపోతే ఆనందించలేకపోయేవాణ్ణి. నిజానికి నేను సంస్కృతం ఇంకా ఎక్కువ నేర్చుకోలేకపోయాననే బాధ ఇప్పుడు నాకు కలుగుతూ ఉంటుంది. ప్రతి బాలుడూ బాలికా సంస్కృతం చక్కగా నేర్చుకోడం అవసరమని తరవాత గ్రహించాను. నా అభిప్రాయం ప్రకారం ఒక భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.

**ప్రక్రియ - "ఆత్మకథ"**

తనను గురించి తాను రాసుకున్న కథ ఆత్మకథ. గొప్ప వ్యక్తుల ఆత్మకథలు వారి కాలంలోని ప్రజల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, ఆచార్య వ్యవహారాలను గురించి తెలుసుకోడానికి ఉపయోగపడతాయి.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. చదువుకొనే రోజుల్లో గాంధీగారి ఆలోచనకు, ఇప్పటి మీ ఆలోచనకు పోలికలేమిటి? తేడాలేమిటి?
2. విద్యార్థిదశ నుండి గాంధీగారు దేనికి ముఖ్యమైన విలువనిచ్చారు?
3. గాంధీగారి విద్యార్థి అనుభవాలు చదవడం మీకు ఎలా అనిపించింది?
4. ఆనాటి పాఠశాల పరిస్థితులకు, ఈనాటి పరిస్థితులకు తేడాలు ఏమైనా ఉన్నాయా? ఉంటే అవి ఏమిటి?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. పాఠంలోని ఐదవ, ఏడవ పేరాలు చదివి, ఆ పేరాలకు తగిన 'పేర్లు' పెట్టండి.
2. కింది పేరాలలో ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

దస్తూరీ విద్యలో ___________ అందరూ గుర్తించాలి. అక్షరాలు ముందు బాలురకు చిత్రలేఖనం ___________ అవసరమని నాకు అనిపించింది. ___________, పిట్టలు

మొదలయిన వాటిని ____________ చిత్రించినట్లే అక్షరాల్ని కూడా ____________ రాయడం అవసరం.



**3. కింది వాక్యాలలో గీతగీసిన పదం ఎవరిని సూచిస్తుందో గుర్తించి రాయండి.**

అ) <u>నాకు</u> మొద్దబ్బాయి అని పేరు రాలేదు.

________________________________

ఆ) నేను చెప్పింది నిజం కాదని <u>ఆయన</u> భావించారు.

________________________________

ఇ) సంస్కృతం రాకపోతే <u>నా</u> దగ్గరకు రావచ్చుకదా?.

________________________________

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) మంచి దస్తూరీ గురించి గాంధీగారి అభిప్రాయం ఏమిటి?

ఆ) తన ప్రవర్తనను గురించి గాంధీ తీసుకున్న జాగ్రత్త ఏమిటి?

ఇ) నాలుగో తరగతిలో గాంధీకి ఎదురైన ఇబ్బందులు ఏవి?

ఈ) సంస్కృత భాషను గురించి గాంధీ అభిప్రాయాలు ఏమిటి?

## III. స్వీయరచన




**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) గాంధీగారి విద్యార్థి జీవితంలో మీకు నచ్చిన విషయాలు రాసి, అవి ఎందుకు నచ్చాయో రాయండి.

ఆ) "వంకర టింకర అక్షరాలు అసంపూర్ణ విద్యకు చిహ్నం" దీనిపై మీ అభిప్రాయం రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**



అ) వ్యాయామం విషయంలో గాంధీజీ పొరబడినట్లు మీరేదైనా విషయంలో పొరబడ్డారా? దాన్నెలా సరిచేసుకున్నారు?

ఆ) గాంధీజీ తన నడతను గురించి ఎంతో జాగ్రత్తగా ఉండేవారుకదా! మీరు ఏయే విషయాలలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ఇ) గాంధీ ఆత్మకథ చదివారు కదా! దీనిద్వారా మీరు ఏ ఏ విషయాలు గ్రహించారో తెలపండి.



## IV. పదజాలం



**1. కింది వాక్యాలలో గీతలు గీసిన వికృతి పదాలకు, పాఠంలో ఉన్న ప్రకృతి పదాలను గుర్తించి వాక్యంలో చేర్చి వాక్యాన్ని తిరిగి రాయండి.**

అ) <u>విద్దె</u> లేనివాడు వింత పశువు.

________________________________


ఆ) నాశనమునకు ముందు <u>గరువము</u> నడుచును.

________________________________

**2. ఈ పాఠంలో మీరు కొత్తగా తెలుసుకున్న పదాలు కొన్నింటిని రాసి, ఆ పదాల అర్థాలు రాయండి.**

| | పదం | | అర్థం |
|---|---|---|---|
| అ) | ________________ | = | |
| ఆ) | ________________ | = | |
| ఇ) | ________________ | = | |
| ఈ) | ________________ | = | |
| ఉ) | ________________ | = | |

## V. సృజనాత్మకత



**1. కింది వానిలో ఒకటి రాయండి.**

అ) మీ అనుభవంలోని సంగతులను కొన్నింటిని "ఆత్మకథ" రూపంలో రాయండి.

ఆ) గాంధీ-సంస్కృత ఉపాధ్యాయుల మధ్య జరిగిన సంఘటనను "సంభాషణ" రూపంలో రాయండి.

## VI. ప్రశంస



**1. గాంధీ ఆత్మకథ ద్వారా నీవు పొందిన స్ఫూర్తిని వివరిస్తూ, నీ స్నేహితుడు / స్నేహితురాలిని కూడా తప్పకుండా చదవమని ప్రోత్సహిస్తూ ఒక లేఖ రాయండి.**



## VII. భాషాంశాలు



**1. కింది వాటిని జటపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ) | షబానా పాడగలదు. | ( ) | ఎ) | విధ్యర్థక వాక్యం |
| ఆ) | నితిన్, బస్సు ఎక్కవద్దు. | ( ) | బి) | అనుమత్యర్థక వాక్యం |
| ఇ) | మామిడి పండ్లు తీసుకురావాలి. | ( ) | సి) | ఆశ్చర్యార్థక వాక్యం |
| ఈ) | నువ్వు కూర్చోవచ్చు! | ( ) | డి) | సామర్థ్యార్థక వాక్యం |
| ఉ) | రామాయణం ఎంత బాగుందో! | ( ) | ఇ) | నిషేదార్థక వాక్యం |

**2. పురుషలు :**

పురుషలు మూడు రకాలు.

అ) ప్రథమ పురుష – ఎక్కడో ఉన్నవారి గురించి తెలిపేది – అతడు, ఆమె, అది, ఇది, వీరు, వారు – వీటికి సంబంధించినది.

<u>అతను</u> డాక్టరు. <u>ఆమె</u> ఉపాధ్యాయిని. <u>వారు</u> ఇద్దరు ఆదర్శ దంపతులు అని అంటూ ఉంటారందరు.

పైనున్న వాక్యాలలోని అతను, ఆమె వారు అనే పదాలను గమనించండి. ఇవి నా గురించి, నీగురించి / మా గురించి, మీ గురించి కాకుండా వేరేవారి గురించి లేదా ఇతరాల గురించి తెలుపుతాయి. అలాంటి పదాలనే ప్రథమ పురుషపదాలు అంటారు.

ఆ) మధ్యమ పురుష – ఎదుట ఉన్నవారి గురించి తెలిపేది – నీవు – మీరు – వీటికి సంబంధించినది.


<u>నీవు</u> ఎక్కడ నుండి వచ్చావు?

<u>మీరు</u> ఎక్కడికి వెళ్ళుతున్నారు?

ఇందులో నువ్వు, మీరు అనే పదాలు దేన్ని గురించి తెలుపుతున్నాయో గమనించండి.

ఇలా ఎదుటి వారిని గురించే తెలిపేపదాలను <u>మధ్యమ పురుషపదాలు</u> అంటారు.

ఇ) ఉత్తమ పురుష – తనను గురించి తెలిపేది – నేను – మేము – మనం – వీటికి సంబంధించినది.



ఈ) ఇలాంటివే మరికొన్ని వాక్యాలు రాయండి.

<u>నేను</u> మాకుటుంబం ఒక జాతరకు వెళ్ళాం.

<u>మేం</u> అక్కడ ఒక నదిని చూశాం.



<u>మనం</u> అందరం కలసి కాలుష్యాన్ని నివారించాలి.

ఇందులో నేను, మేము, మనము అనే పదాలు దేన్ని గురించి తెలియజేస్తున్నాయో గమనించండి.

**అ. కింది వాక్యాలలోని పురుషలు గుర్తించండి.**

అ) వారు ఆడుకొంటున్నారు.

ఆ) మీరు చదువుకొంటున్నారు.

ఇ) నేను రాస్తున్నాను.

ఇలా తనను, తనవారిని గురించి తెలియజేసేవాటిని <u>ఉత్తమ పురుషలు</u> అంటారు.

### ప్రాజెక్టు పని

**గాంధీ జీవితచరిత్ర లేదా ఆత్మకథ పూర్తిగా చదవండి. దాంట్లోనుండి స్ఫూర్తి పొందాల్సిన మరొక సంఘటన / సమావేశాన్ని వివరించండి.**

### నేనివి చేయగలనా..?

| | | |
|---|---|---|
| 1. | గాంధీగారి గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | 'ఆత్మకథ'లను చదివి అర్థం చేసుకోగలను. పాఠం ఆధారంగా ఖాళీలను పూరించగలను. | ఔను / కాదు |
| 3. | ఆలోచించి సొంతమాటల్లో సమాధానాలు రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఆత్మకథ రాయగలను. | ఔను / కాదు |

*"లక్ష్యాన్ని సాధించడం కోసం చేసే నిరంతర ప్రయత్నమే అభ్యాసం."*



© SCERT not to be republished